


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 13-12-2025 | సంపుటి - 26 | సంచిక -206 | రూ : 4 | పేజీలు: 8




## ఉప్పల్ స్టేడియంలో మెస్సీ, సీఎం ఫుట్‌బాల్ మ్యాచ్

- మ్యాచ్‌కు ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ వెల్లడి
- మ్యాచ్ కోసం 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- టిక్కెట్లు ఉన్నవారు మాత్రమే మ్యాచ్‌కు రావాలని సూచన

2లో

## భూకంపాల నివారణ కోర్టు పనా?..

- భూకంపాల నష్టంపై దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు
- 'అందరినీ చంద్రుడిపైకి తరలించాలా?' అంటూ ఘాటుగా ప్రశ్నించిన ధర్మాసనం
- మన దేశాన్ని జపాన్‌తో పోల్చడం సరికాదని హితవు

2లో



### రవీంద్రభారతిలో ఎస్పీ బాలు విగ్రహాన్ని
## ఆవిష్కరించనున్న సీఎం

- బాలు విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 15న ఆవిష్కరణ
- హాజరు కానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2లో



2లో

### జనాభా లెక్కలకు
## కేంద్రం గ్రీన్ సిగ్నల్

**అదే సమయంలో కులగణన కూడా!**

- 2027 జనాభా లెక్కల నిర్వహణకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ.11,718 కోట్ల బడ్జెట్‌తో రెండు దశల్లో చేపట్టనున్న ప్రక్రియ
- దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో గణన
- జనాభా గణనతో పాటు కులాల వారీగా వివరాల సేకరణకు నిర్ణయం

### తెలంగాణలో
## పెరిగిన చలి తీవ్రత

- ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్రత
- ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పడిపోయినట్లు వెల్లడి
- ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికం

2లో



## తలైవాకు బర్త్ డే విషెస్ తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు



2లో

- నేడు సూపర్‌స్టార్ రజనీకాంత్ పుట్టినరోజు
- శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు
- తెరపై, నిజ జీవితంలోనూ హీరో అని రజనీని కొనియాడిన సీఎం
- రజనీకాంత్ వ్యక్తిగత ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్ష

## ఈ రోజు నా మనసును ఎంతగానో హత్తుకుంది

- విశాఖలో 20,000 సీట్ల సామర్థ్యంతో కాగ్నిజెంట్ క్యాంపస్
- తక్షణమే 1,000 సీట్లతో టెక్ ఫిన్ సెంటర్ ప్రారంభం
- ఇది రాష్ట్రానికి గేమ్ ఛేంజింగ్ అంటున్న మంత్రి నారా లోకేశ్
- గత 18 నెలల కృషి ఫలించిందని వ్యాఖ్య
- ఇకపై ఏపీ ప్రగతి పైపైకేనని ధీమా వ్యక్తం చేసిన లోకేశ్

2లో





## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్

2లో

# జనాభా లెక్కలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్... అదే సమయంలో కులగణన కూడా!

ఢిల్లీ : దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద పరిపాలనాపరమైన ప్రక్రియ, జనాభా లెక్కలు 2027కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్న ఈ బృహత్ కార్యక్రమానికి రూ.11,718.24 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ఆమోదముద్ర వేశారు. ఈ జనగణనలో జనాభాతో పాటు కులాల వారీగా వివరాలను కూడా సేకరించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 'ఇళ్ల జాబితా, గృహ గణన' చేపడతారు. ఇక రెండో దశలో అసలైన 'జనాభా లెక్కింపు' కార్యక్రమాన్ని 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. అయితే, లడఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడిన ప్రాంతాల్లో మాత్రం జనాభా లెక్కింపును 2026 సెప్టెంబర్‌లోనే పూర్తి చేస్తారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 30 లక్షల మంది ఫీల్డ్ సిబ్బంది పాల్గొననున్నారు.

*** తొలి డిజిటల్ సెన్సస్... అనేక కొత్త ఫీచర్లు**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇది 8వ జనాభా గణన కాగా, మొత్తంగా 16వది. ఈసారి దీనిని పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నారు. డేటా సేకరణ కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్‌ను (ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లలో) వినియోగిస్తారు. మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 'సెన్సస్ మేనేజ్‌మెంట్ & మానిటరింగ్ సిస్టమ్' పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనిని రియల్ టైంలో సమీక్షించే వీలుంటుంది. ఈసారి ప్రజలకు 'సెల్ఫ్‌ఎన్యూమరేషన్' పేరుతో స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో పాటు, అత్యంత ముఖ్యమైన అంశం కులగణన. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ 2025 ఏప్రిల్ 30న తీసుకున్న నిర్ణయం మేరకు, ఈ జనాభా గణనలో కులాల వారీగా వివరాలను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరిస్తారు. రెండో దశలో జనాభా లెక్కింపుతో పాటే ఈ ప్రక్రియ జరగనుంది.

**అమలు, ప్రయోజనాలు**

ఎప్పటిలాగే, ప్రభుత్వ ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన ఇతర సిబ్బంది ఎన్యూమరేటర్లుగా వ్యవహరిస్తారు. తమ సాధారణ విధులతో పాటు అదనంగా ఈ పని చేస్తున్నందున వారికి ప్రత్యేక గౌరవ వేతనం చెల్లిస్తారు. ఈ డిజిటల్ ప్రక్రియ వల్ల డేటా నాణ్యత పెరగడమే కాకుండా, ఫలితాలు అత్యంత వేగంగా అందుబాటులోకి వస్తాయి. 'సెన్సస్‌యాజ్‌ఎసర్వీస్ (CaaS)' విధానంలో ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు అవసరమైన డేటాను సులభంగా, వేగంగా, యంత్రాలు చదవగలిగే ఫార్మాట్‌లో అందిస్తారు. ఇది విధాన రూపకల్పనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ బృహత్ కార్యక్రమం ద్వారా గణనీయమైన ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి. వివిధ సాంకేతిక పనుల కోసం స్థానిక స్థాయిలో సుమారు 18,600 మందిని 550 రోజుల పాటు నియమించుకోనున్నారు. దీని ద్వారా దాదాపు 1.02 కోట్ల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ డిజిటల్ ప్రక్రియలో పాల్గొనడం వల్ల సిబ్బందికి సాంకేతిక నైపుణ్యాలు కూడా పెరుగుతాయి. గ్రామ, వార్డు స్థాయి వరకు సూక్ష్మస్థాయిలో డేటాను అందుబాటులో ఉంచడం ఈ సెన్సస్ ముఖ్య ఉద్దేశం.

## ఉప్పల్ స్టేడియంలో రేపు సాయంత్రం మెస్సీ, సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ మ్యాచ్

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో రేపు రాత్రి 7 గంటలకు జరగనున్న ఫుట్‌బాల్ మ్యాచ్‌లో గ్లోబల్ సాకర్ లెజెండ్ లియోనెల్ మెస్సీతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. 'మెస్సీ గోట్ ఇండియా' టూర్‌లో భాగంగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌ల కోసం 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ వెల్లడించారు. టిక్కెట్లు కలిగిన వారు మాత్రమే మ్యాచ్‌కు హాజరుకావాలని సూచించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో 34 చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మెస్సీ రేపు సాయంత్రం 4 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటాడు. అక్కడి నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో సందడి చేయనున్నాడు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్, అక్కడి నుంచి ఉప్పల్ స్టేడియం వరకు ప్రయాణించే మార్గాలను ఖరారు చేశారు. రేపు రాత్రి మెస్సీ ఫలక్‌నుమా ప్యాలెస్‌లోనే బస చేయనున్నాడు.

## ఈ రోజు నా మనసును ఎంతగానో హత్తుకుంది

అమరావతి :ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగానికి భారీ ఊపునిస్తూ, ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ విశాఖపట్నంలో భారీ కార్యకలాపాలు ప్రారంభించనుంది. నగరంలో 20,000 సీట్ల సామర్థ్యంతో శాశ్వత క్యాంపస్‌కు భూమిపూజ చేయడంతో పాటు, తక్షణమే 1,000 సీట్లతో ఒక తాత్కాలిక టెక్ ఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ పరిణామం రాష్ట్ర ప్రగతిలో ఒక కొత్త అధ్యాయమని ఆయన అభివర్ణించారు. తాజాగా దీనిపై ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. "ఈరోజు నాకు చాలా వ్యక్తిగతమైనది. గత 18 నెలలు అంత సులభంగా గడవలేదు... ప్రపంచ పెట్టుబడిదారులను ఒప్పించడం, నమ్మకాన్ని తిరిగి నిలబెట్టడం, ఇటుక ఇటుక పేర్చి ఆంధ్రప్రదేశ్ కథను మళ్లీ చెప్పడం వంటివి ఎంతో శ్రమతో కూడుకున్నవి. విశాఖలో 20,000 సీట్ల సామర్థ్యంతో కాగ్నిజెంట్ తన క్యాంపస్‌కు భూమిపూజ చేయడం, 1,000 సీట్ల తాత్కాలిక టెక్‌ఫిన్ కేంద్రాన్ని ప్రారంభించడంతో మనం ఒక కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్నాం. మన యువ రాష్ట్ర ప్రయాణంలో ఇది ఒక సరికొత్త అధ్యాయం, ఒక కీలకమైన మలుపు. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఒకేఒక్క మార్గం ఉంది... అది అభివృద్ధి పథమే" అని లోకేశ్ ఉద్ఘాటించారు.

## తలైవాకు బర్త్ డే విషెస్ తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు

విజయవాడ : సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తన ప్రియ మిత్రుడికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ వ్యక్తిత్వాన్ని, ఆయన ప్రయాణాన్ని చంద్రబాబు కొనియాడారు. "నా ప్రియ మిత్రుడు, లెజెండరీ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు! తెరపై, నిజ జీవితంలో హీరోలుగా ప్రకాశించే అతి కొద్ది మందిలో ఆయన ఒకరు. ఆయన వ్యక్తిగత ప్రయాణం కూడా అసాధారణమైన సినిమా ప్రయాణం అంతే స్ఫూర్తిదాయకం. ఆయనకు ఈ రోజు మరెన్నో సంతోషాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను. నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను!" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు, రజనీకాంత్ మధ్య దశాబ్దాలుగా బలమైన స్నేహబంధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో అనేక బహిరంగ సభల్లో ఇరువురూ తమ స్నేహాన్ని, ఒకరిపై ఒకరికి ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. చంద్రబాబు లాంటి రాజకీయ నాయకుడు చాలా అరుదని రజనీకాంత్ పలు సందర్భాల్లో ప్రశంసించగా, రజనీకాంత్ వ్యక్తిత్వాన్ని చంద్రబాబు కూడా ఎన్నోసార్లు కొనియాడారు. ఈ నేపథ్యంలో రజనీ పుట్టినరోజున చంద్రబాబు చేసిన పోస్ట్ వారి స్నేహానికి నిదర్శనంగా నిలిచింది.

## భూకంపాల నివారణ కోర్టు పనా? ...

ఢిల్లీ :భూకంపాల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ, "అయితే ఇప్పుడు ప్రతి ఒక్కరినీ చంద్రుడిపైకి తరలించాలా?... అయినా భూకంపాల నివారణ కోర్టు పనా?" అని ఘాటుగా వ్యాఖ్యానించింది. భారత్‌లో సుమారు 75 శాతం మంది ప్రజలు భూకంపాలు సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వారి భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జపాన్‌లో భూకంపాలు వచ్చినా అక్కడి ఆధునిక సాంకేతికత, పటిష్టమైన భవన నిర్మాణాల వల్ల నష్టం తక్కువగా ఉంటుందని పిటిషన్‌లో ప్రస్తావించారు. అదే తరహాలో ఇక్కడ కూడా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వాదనలను తోసిపుచ్చింది. "మన దేశ పరిస్థితులను జపాన్‌తో ఎలా పోలుస్తారు? అలా పోల్చాలంటే ముందు మన దేశంలోకి అగ్నిపర్వతాలను తీసుకురావాలి. భూకంపాల నష్టాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాల్సింది ప్రభుత్వం... న్యాయస్థానం కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెబుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. హిమాలయాల కారణంగా భారతదేశం కూడా భూకంప ప్రభావిత దేశమని, ప్రమాదకర ప్రాంతాల్లో భవన నిర్మాణ నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు ఎప్పటినుంచో సూచిస్తున్నారు.



## తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల కారణంగా రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయని పేర్కొంది. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది. శుక్రవారం, శనివారం శీతల, అతి శీతల పవనాలు వీచే అవకాశం ఉన్నందున ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి శ్రావణి తెలిపారు. రానున్న రోజుల్లో పొగమంచు పెరిగే అవకాశం ఉందని అన్నారు. శీతల గాలులు, పొగమంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 9 జిల్లాలతో వీఈఆర్..
# సీఎం చంద్రబాబు కీలక సమీక్ష...



విజయవాడ : తొమ్మిది జిల్లాలతో కూడిన విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) ను ప్రపంచస్థాయి ఆర్థిక కేంద్రంగా (గ్లోబల్ ఎకనమిక్ హబ్) తీర్చిదిద్దేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 2032 నాటికి ఈ ప్రాంతాన్ని 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, తద్వారా 30 లక్షల ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీఈఆర్ అభివృద్ధిపై శుక్రవారం విశాఖలో మంత్రులు, 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన తొలిసారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీఈఆర్‌కు సంబంధించిన 49 ప్రాజెక్టులపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. 7 గ్రోత్ డ్రైవర్లు, 10 పాలసీలతో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "విశాఖను మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దాలి. భూసేకరణ ప్రక్రియ వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా జరగాలి. రాష్ట్రంలో విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు ప్రధాన ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం" అని చంద్రబాబు అన్నారు. సమర్థంగా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే 2047 నాటికి వీఈఆర్ ఆర్థిక వ్యవస్థ 800 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు వంటి అన్ని రంగాల్లో వీఈఆర్ అభివృద్ధి చెందాలని సూచించారు. అనకాపల్లిలో త్వరలోనే మెడ్‌టెక్ జోన్ 2 ఏర్పాటు చేస్తామని, టాయ్స్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేవారికి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఐటీ, ఏఐ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరానికి మించి డేటా సెంటర్లను ప్రోత్సహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో అనుసంధానించాలని, రహదారుల విస్తరణపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని, రైతులు లాభసాటి పంటల వైపు మళ్లేలా చూడాలని సూచించారు. కైలాసగిరి నుంచి భీమిలి వరకు ఉన్న తీర ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. వీఈఆర్ అభివృద్ధి పనులపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

**9 జిల్లాలతో వీఈఆర్**

విశాఖపట్నం తూర్పు గోదావరి రీజియన్ (వీఈఆర్) సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం 9 జిల్లాల పరిధిలో మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధి లక్ష్యంగా ఈ బ్లూప్రింట్ సిద్ధమైంది.

## రవీంద్రభారతి ప్రాంగణంలో ఎస్పీ బాలు విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 15న జరగనుంది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరు కానున్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో బాలు విగ్రహం ఏర్పాటును కొందరు వ్యతిరేకించగా, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యతిరేకతను తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన
# యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ నగర పర్యటనలో ఉన్న అఖిలేశ్ యాదవ్, జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిరువురు జాతీయ రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి అఖిలేశ్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యం

*** జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని కూన మహాలక్ష్మి నగర్ లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్డు, యూజీడి పనులను త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వెంకటేష్, మహంకాళి, దుర్గయ్య, సిద్దయ్య, ఆంజనేయులు, తిరుపతయ్య, బస్తి వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. కొయ్యలగూడెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**- మాచర్ల ప్రమీల సంతోష్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామ ప్రజలు ఓటు వేసి ఆశీర్వదిస్తే.. కొయ్యలగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ కొయ్యలగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మాచర్ల ప్రమీల సంతోష్ అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో మహిళలతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి, ఆ కుటుంబ సభ్యులకు బొట్టు పెట్టి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం నిర్వహించారు. వారి యోగక్షేమాలను ఆరాతీస్తూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాచర్ల ప్రమీల సంతోష్ మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో గ్రామ సర్పంచ్ గా బరిలోకి దిగానన్నారు. ఆయన అడుగుజాడల్లో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానన్నారు. తాను గెలిచిన వెంటనే చేసే పనులపై ఆరు సూత్రాల ప్రణాళిక రూపొందించానన్నారు. మహిళ సంఘాల కోసం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం, అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ప్రతి వీధిలో విద్యుత్ దీపాలు, సిసి రోడ్ల నిర్మాణం, శాశ్వత డ్రైనేజీ పరిష్కారం, ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించడం, నిరుద్యోగ యువత కోసం ఉపాధి అవకాశాల కల్పన, గ్రామ సమస్యల పరిష్కారం కోసం 24గంటల హెల్ప్ లైన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బ్యాటు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

# ముక్కోటి ఏకాదశి గోడపత్రికలు ఆవిష్కరించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 29, 30 తేదీలలో జరగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు పూర్తి సమాచారం అందించే విధంగా ప్రత్యేక గోడపత్రికలను ఆవిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో తన చాంబర్లో ఈ గోడపత్రికలను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చేందుకు అవసరమైన సమాచారం గోడపత్రికల రూపంలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ గోడపత్రికలను ఉమ్మడి ఖమ్మం జిల్లా కాకుండా రాష్ట్రం మొత్తం వ్యాప్తంగా అంటించడం జరుగుతుందని వివరించారు.ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు అవసరమైన వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను సమీక్షించేందుకు ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో వసతి, తాగునీరు, పరిశుభ్రత వంటి ఏర్పాట్లపై డివిజన్ అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, అర్చక స్వాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ల విభజన ప్రక్రియ సక్రమంగా, విధివిధానాలకు అనుగుణంగా జరగలేదు

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : డివిజన్ల విభజన ప్రక్రియ సక్రమంగా, విధివిధానాలకు అనుగుణంగా జరగలేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని 8 వార్డులు, మూడు మున్సిపాలిటీల విభజన సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ పరిధిలోని 8 డివిజన్లు , దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల డివిజన్ల విభజన ప్రక్రియను సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ ఇచ్చినా, జీహెచ్ఎంసీ అవసరమైన వివరాలు ప్రజలకు అందించకపోవడం వల్ల పెద్ద ఎత్తున అయోమయం ఏర్పడిందని ఆయన తెలిపారు. పునర్విభజనకు అవసరమైన తాజా డివిజన్ మ్యాప్‌లు ఇప్పటికీ జీహెచ్ఎంసీ అందించలేదన్నారు. ప్రతి డివిజన్ పరిధిని గుర్తించేందుకు అవసరమైన ఇంటి నంబర్ల వివరాలు ప్రకటించలేదన్నారు. జనాభా లెక్కల ప్రకారం ఎన్యూమరేషన్ బ్లాక్‌ల వివరాలు వెల్లడించలేదని, పోలింగ్ బూత్‌ల జాబితా కూడా ప్రకటించలేదన్నారు. కాలనీ పేర్లు స్పష్టంగా లేకపోవడం వల్ల ప్రజలు తమ డివిజన్ సరిహద్దులను గుర్తించలేకపోతున్నారు. వివరాల లేమితో జీహెచ్ఎంసీ నిర్ణయించిన గడువు లోపల ప్రజలు ఎలా అభ్యంతరాలు సమర్పించగలరో ఎమ్మెల్యే ప్రశ్నించారు. డివిజన్ మ్యాప్‌లు, కాలనీ జాబితాలు, ఇంటి నంబర్ వివరాలు, పోలింగ్ బూత్ సమాచారం, ఎన్యూమరేషన్ బ్లాక్ డేటా, అన్నివాటినీ పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు , పార్టీ నాయకులు కూడా ఈ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే సంబంధిత జీహెచ్ఎంసీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.




# ఘనంగా స్వర్గీయ మణిపాల్ రెడ్డి జయంతి వేడుకలు

*** పదవ తరగతి విద్యార్థులకు 'ఆల్ ఇన్ వన్' పుస్తకాల పంపిణీ**

ప్రజాస్ఫూర్తి, కాప్రా: కమలానగర్ స్ఫూర్తి క్లబ్ నిర్మాత స్వర్గీయ మణిపాల్ రెడ్డి నాలుగో వర్ధంతి జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాప్రాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 'ఆల్ ఇన్ వన్' పాఠ్యపుస్తకాలను మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కుషాయిగూడ జోన్ అదనపు డిప్యూటీ కమిషనర్ నల్లమోతు వెంకటరమణ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మణిపాల్ రెడ్డి నాకు అత్యంత సన్నిహిత మిత్రుడు. ఆయన ఎప్పుడూ సేవాభావంతో ఆలోచించేవారు. ప్రతి సారి కలిసినప్పుడు ప్రజల కోసం చేయాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించేవారు. అలాంటి మంచి మిత్రుడిని కోల్పోవడం బాధాకరం అన్నారు. కీర్తిశేషులు మణిపాల్ రెడ్డి స్ఫూర్తిగా లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, రాజీవ్, డీసీఎస్ రవి యాదవ్, డీసీటీ కిరణ్ కుమార్, ఆర్.సి. శ్రీధర్ గౌడ్, చీఫ్ కోఆర్డినేటర్ సంపత్ కాశపి రెడ్డి, జీఎస్టీ కన్నన్, ప్రెసిడెంట్ వెంకటకృష్ణారెడ్డి, సెక్రటరీ సుధాకర్ రెడ్డి, రూపా రెడ్డి, లక్ష్మీమూర్తి, శేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమాదేవి, వంజరి ప్రవీణ్, అచ్చయ్య, సాంబశివరావు, సంజీవరెడ్డి, రామాచారి, హరినాథ్, మధుసూదన్, కాశీనాథ్, రాజేంద్ర ప్రసాద్ రాజు, రాజేష్ చోడే, సురేందర్, పద్మావతి, శ్రీలత, విజయ్ కుమార్, గోవర్ధన్, రాము, రాజేష్, అరుణ్, ఉమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

*** కలెక్టర్ జితేష్ వి.పాటిల్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిష్పక్షపాతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లావణ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు పాల్గొన్న టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.కలెక్టర్ మాట్లాడుతూ తొలి విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన అధికారులను అభినందించారు. మొదటి విడతలో వచ్చిన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని రెండవ విడతలో ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో తాగునీరు, భోజనం, విద్యుత్, స్ట్రాంగ్‌రూమ్ వంటి అన్ని సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రిజిస్టర్లు తదితర ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాగ్రి తరలింపుకు అవసరమైన వాహనాలు పూర్తిగా సిద్ధంగా ఉండాలని, ఆలస్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో రద్దీ లేకుండా సవ్యమైన ఏర్పాట్లు చేయాలని, ఓటర్ రిజిస్టర్‌ను కచ్చితంగా నిర్వహించాలని, ప్రతి ఓటరును ధృవీకరించిన తరువాతే ఓటు వేయడానికి అనుమతించాలని స్పష్టం చేశారు. దొంగ ఓట్లను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి అని, బ్యాలెట్ బాక్సులపై వీడియో పర్యవేక్షణ ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకుని నిర్ణీత రూట్ మ్యాప్ ప్రకారం తరలించాలని ఆదేశించారు.కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు, అదనపు సిబ్బంది మోహరింపు, అవసరమైన టేబుళ్ల ఏర్పాటు వంటి చర్యలను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. రెండు వేలకుపైగా ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ జరగనుందని, ఓటర్లలో అవగాహన పెంచేందుకు పంచాయతీ వాహనాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున పోలింగ్ తరువాత ర్యాలీలు, విజయోత్సవాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

*** పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు: ఎస్పీ రోహిత్ రాజు**

ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, రెండవ విడత ఎన్నికలు పూర్తి శాంతిభద్రతల మధ్య సాగేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. పోలీసులు - ఎన్నికల సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే ఆశీస్సులతో బరిలోకి దిగిన బద్దం మమత వెంకట్ రెడ్డిని గెలిపించాలి

**- బండమీది వెంకటేశం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆశీస్సులతో అల్లాపురం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన బద్దం మమత (అర్ధ పల్లవి) వెంకట్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అల్లాపురం ఎన్నికల ఇంచార్జి బండమీది వెంకటేశం కోరారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీకి కట్టుబడి ఉన్నారన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో అల్లాపురం గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయడంలో ముందుంటారన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామానికి నిధులు తీసుకొచ్చి వేగంగా అభివృద్ధి చేస్తారన్నారు. సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులను సైతం గెలిపించాలని కోరారు. సర్పంచ్ గా బద్దం మమత (అర్ధ పల్లవి) వెంకట్ రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని, బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.

# జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బోదాసు దేవరాజు (37) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ తెలిపారు. దేవరాజు భార్య పుట్టింటికి వెళ్లి గత సంవత్సరం నుంచి కాపురానికి రావడం లేదని, కొన్ని రోజులుగా బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది, ఈ నెల 11న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గూడెం శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. ఈ మేరకు మృతుని తండ్రి బోదాసు నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించామని తెలిపారు.

# కూకట్ పల్లి నూతన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా జె. తిమ్మప్ప



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నూతన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా జె. తిమ్మప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ముత్తు యాదవ్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు బదిలయ్యారు. ఆయన స్థానంలో ఆల్వాల్ పోలీస్ స్టేషన్ లో డిఐగా విధులు నిర్వహిస్తున్న తిమ్మప్ప కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ తిమ్మప్ప మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

# వీధి కుక్క దాడి.. తెగిపడిన చిన్నారి చెవి

ఆత్మకూరు: నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణం ఇస్లాంపేట వీధిలో మూడేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడి చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గౌసియా, ఖుర్షీద్ వలి దంపతుల మూడేళ్ల కుమార్తె అర్షియా ఇంటిముందు ఆడుకుంటుంది. అటువైపు వచ్చిన ఓ వీధి కుక్క చిన్నారిపై దాడి చేసి నోటితో పట్టుకొని లాక్కెళ్లిపోయింది. గమనించిన వ్యక్తి కుక్కను తరమడంతో వదిలేసింది. బాలిక చెవిని కుక్క సగం వరకు కొరికేయడంతో తెగి పడిపోయింది. చెంపపై తీవ్రంగా గాయపరిచింది. చిన్నారిని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

# జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం.. డిప్యూటీ సీఎం భట్టి కీలక హామీలు

జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంట్ బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ బృందాన్ని ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనేక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని, తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఉందని జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూర దృష్టితో సైబర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామని తెలిపారు.



# మెస్సీ మేనియా..
## హైదరాబాద్ రానున్న రాహుల్‌గాంధీ



హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు రానున్నారు. అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ, సీఎం రేవంత్‌రెడ్డి జట్ల మధ్య డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ రానున్నారు. 13న సాయంత్రం 4.15 గంటలకు రాహుల్ గాంధీ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. రాత్రి 7.15 గంటలకు ఉప్పల్ మైదానానికి చేరుకోనున్నారు. 'మెస్సీ గోట్ ఇండియా టూర్' కోసం పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈనెల 13న రాత్రి 7గంటలకు ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫుట్‌బాల్ మ్యాచ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2500 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మ్యాచ్‌కు టికెట్లు ఉన్నవాళ్లు మాత్రమే రావాలని సూచించారు. 34 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.




# లైంగిక వేధింపుల ఆరోపణలు..
## జేఎన్టీయూ ప్రొఫెసర్ అరెస్టు

హైదరాబాద్: కూకట్‌పల్లి జేఎన్టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ ప్రొఫెసర్‌ను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గమని నమ్మబలికి, ఆ తర్వాత ఉద్యోగం తీసేయిస్తానని బెదిరించి వేధింపులకు పాల్పడ్డాడని బాధిత గెస్ట్ లెక్చరర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కారులో తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో బాధితురాలి దాంపత్య జీవితం కూడా దెబ్బతిందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.



# బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం..
## ఆత్మహత్యలు చేసుకోవద్దు: మహేష్ గౌడ్

హైదరాబాద్: బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం.. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా.వినయ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, నూతి శ్రీకాంత్, మెట్టు సాయి తదితరులు పరామర్శించారు. ఈశ్వర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మహేష్‌గౌడ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

# డ్రైనేజీలో బ్యాలెట్ పత్రాలు.. ఘటనపై కలెక్టర్ చర్యలు

నల్గొండ: నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి బ్యాలెట్ పత్రాలు డ్రైనేజీలో కనిపించడం కలకలం సృష్టించింది. కత్తెర గుర్తుకు ఓటువేసి ఉన్న బ్యాలెట్ పత్రాలు మురుగు కాలువలో దర్శనమివ్వడం తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఈ ఘటనపై ఎన్నికల అధికారి, పోలీసులకు భారత రాష్ట్ర సమితి నేతలు ఫిర్యాదు చేశారు. రిగ్గింగ్ జరిగిందని భారత రాష్ట్ర సమితి మద్దతుదారు రుద్రారపు భిక్షం ఆరోపించారు. నిన్న వెలువడిన సర్పంచి ఎన్నికల ఫలితాల్లో 455 ఓట్ల తేడాతో ఆయన ఓడిపోయారు. బ్యాలెట్ పత్రాలు బయటికి వెళ్లిన ఘటనలో జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తిలో డ్రైనేజీలో నిన్నటి బ్యాలెట్ పత్రాలు లభ్యమైన సంగతి తెలిసిందే. ఘటనకు సంబంధించి స్టేజ్ 2 ఆర్వోను కలెక్టర్ ఇలా త్రిపాఠి సస్పెండ్ చేశారు.




# మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులకు అస్వస్థత

హైదరాబాద్: మాదాపూర్ చందానాయక్ తండ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థులను కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**బాగ్‌లింగంపల్లిలో..**

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన ఏడుగురు విద్యార్థులు నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రి భోజనం చేసిన విద్యార్థులు వాంతులు, విరోచనలు, కడుపునొప్పితో బాధపడుతున్నారని, వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించామని గురుకుల పాఠశాల సిబ్బంది తెలిపారు. పిల్లల ఆరోగ్య ప్రస్తుతం నిలకడగానే ఉందని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తెలిపారు.



# అల్లుడి చేతిలో గార్ల మాజీ ఎంపీపీ హతం

నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్): అల్లుడి చేతిలో మామ హతమైన ఘటన మహబూబాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. కుమార్తెను వేధింపులకు గురి చేస్తున్న అల్లుడిని ప్రశ్నించేందుకు వెళ్లిన గార్ల మాజీ ఎంపీపీ లాలూ నాయక్‌పై అల్లుడు దాడి చేయడంతో ఆయన తీవ్రగాయాలపాలై మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం మర్రిగూడెం శివారు బొజ్జ తండాకు చెందిన బానోత్ లాలూ నాయక్ కుమార్తె లహరికి.. కురవి మండలం పెద్దతండాకు గాంధీ నాయక్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో లహరి పుట్టింటికి వెళ్లిపోయింది. 16 నెలల తర్వాత పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి తిరిగి ఆమెను కాపురానికి పంపించారు. ప్రస్తుతం మహబూబాబాద్ పట్టణంలోని మిలటరీ కాలనిలో నివాసం ఉంటున్నారు. భర్త తనను కొడుతున్నాడని తండ్రి లాలూ నాయక్‌కు గురువారం రాత్రి లహరి ఫోన్ చేసి చెప్పింది. దీంతో లాలూ నాయక్ అతని కుమారుడు ప్రదీప్.. వచ్చి ఎందుకు కొడుతున్నావని అల్లుడిని నిలదీయడంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది ఈ క్రమంలో గాంధీ నాయక్ దాడి చేసి నెట్టివేయడంతో లాలూ నాయక్ తలకు తీవ్ర గాయమైంది. మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధరించారు.



మృతుని కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# వందేళ్ల వరకు ఇక టెన్షన్ అవసరం లేదు: మంత్రి పొంగులేటి

జనవరి నెలలో ప్రారంభం కానున్న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని, గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సహచర మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజు, ఉన్నతాధికారులతో కలిసి జాతర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు నిర్వహించి, అమ్మవార్ల కృపతో అభివృద్ధి పనులలో ఎటువంటి ఆటంకం లేకుండా అనుకున్న సమయానికి ఏర్పాట్లు పూర్తయేలా దీవించమని కోరుకున్నారు. అనంతరం సమ్మక్కసారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి, ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలు, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ, జంపన్న వాగు వద్ద పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు మరో వందేళ్ల వరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసే విధంగా నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ జాతరకు గిరిజనులు, గిరిజనేతరులు దాదాపు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారు, జాతర ప్రారంభం నాటికి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకువెళ్తున్నట్లు తెలిపారు. జాతర కోసం 50 కిలోమీటర్ల పరిధిలో అన్ని రకాల అభివృద్ధి పనులను భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నాము. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మేడారం ప్రాంగణాన్ని మహా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



# రేపే చివరి రోజు..
## గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డేకు భారీ సంఖ్యలో సందర్శకులు

ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో కొనసాగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు మూడో రోజు శుక్రవారం వేలాది మందితో కిటకిటలాడింది. రియల్ లైఫ్‌లో రిజిలియెన్స్ అనే అంశంపై ప్రారంభమైన నేటి సెషన్ కు నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చలో, వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో రిజిలియెన్స్ ప్రాముఖ్యత, వ్యక్తిగత, వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కోవడం, కొత్త మార్పులకు త్వరగా అలవాటు పడే నాయకత్వ నైపుణ్యాలు, ఏఐ, ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో భవిష్యత్ సిద్ధత, యువతలో గ్రోత్ మైండ్‌సెట్, సమస్య పరిష్కార దృష్టికోణాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ సదస్సులో యూఐడీఏఐ మాజీ చైర్మన్ జి. సత్యనారాయణ, మాజీ ఐఏఎస్ జితేంద్ర పుచ్చ, మాస్టెక్ డిజిటల్ చీఫ్ డెలివరీ ఆఫీసర్ శ్రీనివాస్ ఆత్రేయ, సీటీవో, అవికా కిషోర్ ఉప్పలపాటి, క్విలిస్ సీఈఓలు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ముఖ్యంగా ఆకర్షణీయమైన అంశం విద్యార్థులు పాల్గొనడం. వేలాది మంది మధ్య జరిగిన ఈ చర్చలో విద్యార్థులు ఎంతో చురుకుగా ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండ్ క్రాఫ్ట్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు అధునాతన పరికరాలు, డ్రోన్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు చివరి రోజైన శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ఈ గ్లోబల్ సదస్సును సందర్శించవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాడు అగ్రికల్చర్, రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ , ఫార్మర్స్ రైసింగ్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని ఆ ప్రకటనలో వెల్లడించారు. ఈ రోజు కార్యక్రమానికి దాదాపు ఆరువేలకు పైగా హాజరు కాగా వీరిలో ఐదు వేల మంది విద్యార్థులు,1000 మంది ప్రజలు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు సహకారంతో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం: ఆర్టీసీ ఎండీ

విజయవాడ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను క్రమంగా పరిష్కరిస్తూ వస్తున్నట్లు చెప్పారు. గతంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంతో అనేక సమస్యలు వచ్చాయన్న ఎండీ.. కూటమి



ప్రభుత్వ సహకారంతో సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో పలు సంస్థల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తీర్చుతున్నామన్నారు. ఆర్టీసీలో ప్రధాన ఉద్యోగసంఘం ఎన్ఎంయూఏ ద్వితీయ రాష్ట్ర మహాసభలకు తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ సహా అన్ని జిల్లాల ఎన్ఎంయూఏ నేతలు, పెద్దఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న స్త్రీ శక్తి పథకాన్ని ఆర్టీసీ ఉద్యోగులు విజయవంతం చేశారన్న ఎండీ ద్వారకా తిరుమలరావు.. స్త్రీ శక్తి పథకం సమర్థంగా అమలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు అభినందించినట్లు చెప్పారు. స్త్రీ శక్తి పథకం విజయవంతం చేయడంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది కృషి అమోఘమని ప్రశంసించారన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు 7శాతం పెరిగాయన్న ద్వారకా తిరుమలరావు.. ఏపీఎస్ ఆర్టీసీలో మాత్రం ప్రమాదాలు 9 శాతం తగ్గాయన్నారు. సీఎం చంద్రబాబు అంగీకరించడంతో ఆర్టీసీలో 7వేల మందికి పదోన్నతులు వచ్చాయని, రిటైర్డ్ ఉద్యోగులకు విలీనం తర్వాత EHS రద్దు చేయగా.. ఈ ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు.



## బస్సు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో 9 మంది మృతి చెందగా, పలువురికి గాయాలైన విషయం తెలిసిందే. చింతూరుమారేడుమల్లి ఘాట్ రోడ్డు ప్రమాద స్థలిని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపరిశీలించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిల్లా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఇతర అధికారులు ఉన్నారు.

## మా గ్రామానికి రోడ్డు కావాలి
# పవన్‌తో అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక

అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ కప్ సాధించిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టును మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పవన్ కలిశారు. ఈ విజయం దేశానికే గర్వకారణమని పవన్ కొనియాడారు. ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించిన ఆయన.. ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. క్రికెటర్లందరికీ పట్టు చీర, జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను





అందించి సత్కరించారు. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా విజ్ఞప్తి చేస్తానని పవన్ హామీ ఇచ్చారు. మహిళా క్రికెటర్లు చెప్పిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రపంచకప్ గెలిచిన జట్టులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక, పాంగి కరుణ కుమారి ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ దీపిక.. సత్యసాయి జిల్లాలోని తన స్వగ్రామం హేమావత్ పంచాయతీ తంబలహట్టి తండాకు రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన క్రికెటర్ కరుణకుమారి చేసిన విజ్ఞప్తులపైనా తక్షణమే చర్యలు ప్రారంభించాలన్నారు.



## పంట కాల్వలోకి దూసుకెళ్లిన ఆటో
### : ముగ్గురి మృతి

కొల్లూరు: బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడి వద్ద ఆటో పంటకాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొబ్బరికాయల లోడుతో కొల్లూరు నుంచి వెల్లటూరు వైపు వెళ్తోన్న ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. మృతులను చింతమోటు గ్రామానికి చెందిన చాట్రగడ్డ కాంతారావు (48) పెసర్లంక శ్రీనివాసరావు(55), షేక్ ఇస్మాయిల్(55)గా గుర్తించారు. ఘటనపై కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలిని స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పరిశీలించి, బాధితులకు ధైర్యం చెప్పారు.

## వెలిగొండ ప్రాజెక్టులో
# జగన్ మోసం తెలియాలనే రైతులతో కలిసి సమీక్ష

: నిమ్మల



పెద్దదోర్నాల: ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ లైనింగ్ పనులను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. స్థానిక రైతులతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్‌లో 18 కి.మీ ప్రయాణించి క్లిష్టమైన లైనింగ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ''వెలిగొండ ప్రాజెక్టులో జగన్ చేసిన తప్పిదాలు, దగా, మోసం, జిల్లా రైతులకు తెలియాలనే.. రైతులతో కలసి సమీక్ష నిర్వహించాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెడ్ రెగ్యులేటర్‌లో 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, 18 నెలల్లోనే టన్నెల్‌లో క్లిష్టమైన 3 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం 4 గ్యాంట్రీలతో రోజుకు 12 మీటర్ల లైనింగ్ పనులు చేస్తుండగా, గ్యాంట్రీల సంఖ్య పెంచి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించాం. ఫీడర్ కెనాల్‌లో 45వేల క్యూబిక్ మీటర్ల హార్డ్ రాక్ పనులు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 28వేల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తి చేశాం. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.456 కోట్లతో టెండర్లు పూర్తి చేశాం. ఈ డిసెంబర్‌లోనే పనులు మొదలు పెట్టి, సీజన్ వచ్చేలోపు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించాం. తీగలేరు కెనాల్‌కు సంబంధించి 600మీటర్ల టన్నెల్ లైనింగ్ చేసి, గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. నల్లమల సాగర్ ముంపుతో 9.6 కి.మీ పర్మినెంట్ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టాం. మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చి, జంట సొరంగాల్లో డీవాటరింగ్ పనులను పూర్తి చేసి, లైనింగ్ పనులు చేస్తున్నాం. జగన్ వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే నాటికి ఇంకా రూ.4వేల కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తి కాకుండానే, పూర్తి చేసినట్టు జాతికి అంకితం చేసి దగా, మోసానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా.. జగన్ విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు'' అని మంత్రి నిమ్మల తెలిపారు.

## ఎమ్మెల్యే కొలికపూడి మరో కొత్త వివాదం..
# వాట్సప్‌లో స్టేటస్‌లు!



తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరో కొత్త వివాదానికి తెరతీశారు. విస్సన్నపేట మండల తెదేపా అధ్యక్షుడు రాయల సుబ్బారావును లక్ష్యంగా చేసుకుని వాట్సప్‌లో కొలికపూడి స్టేటస్‌లు పెట్టారు. ''నువ్వు దేనికి అధ్యక్షుడివి?జూదం క్లబ్‌కా?జూదం కోసం ఆఫీస్ పెట్టావంటే నువ్వు నిజంగా రాయల్'' అని స్టేటస్‌లో పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే వివరణ కోరగా.. చాలాకాలంగా రాయల సుబ్బారావు జూదం ఆడిస్తున్నారని ఆరోపించారు. గతంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై బహిరంగ ఆరోపణలు చేశారు. పార్టీకి కొలికపూడి నష్టం చేకూర్చేలా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన తెదేపా అధిష్ఠానం.. ఆయన్ను పిలిపించి వివరణ తీసుకుంది. అయినా కొలికపూడి తీరు మారడం లేదు.

## జై దుర్గా భవానీ..
# ఇంద్రకీలాద్రిపై రెండోరోజు దీక్షల విరమణ

**ఇంద్రకీలాద్రి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై రెండోరోజు భవానీ దీక్షల విరమణ కొనసాగుతోంది. దీంతో అమ్మవారి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భవానీ దీక్షాపరులు ఆలయానికి పోటెత్తారు.**













# గోదావరి పుష్కరాల తేదీలు ఖరారు



ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే పవిత్ర గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు అయింది. 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం అవుతాయని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 12 రోజుల పాటు పుష్కరాలు కొనసాగుతాయని పేర్కొంది. కాగా గోదావరి పుష్కరాల తేదీలు, ముహూర్తంపై తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ వివరాలను ఎండోమెంట్ కమిషనర్ కు అందించారు. ఈమేరకు గోదావరి పుష్కారాలు తేదీలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2027 జూన్ 26 నుంచి మొదలయ్యే పుష్కరాలు జులై 7 వరకు జరగనున్నాయి. కాగా ఈ పుష్కరాల ఏర్పాట్లపై త్వరలోనే సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

# ఆ హైకోర్టులో ఏదో జరుగుతోంది? - సుప్రీం కీలక వ్యాఖ్యలు

తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి కేసు విచారణ సమయంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేసుల విచారణ, లిస్టింగ్‌ల వ్యవహారంలో మద్రాస్ హైకోర్టులో ఏదో తప్పిదం జరుగుతోందని అభిప్రాయపడింది. ఆ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అందించిన నివేదికను పరిశీలించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానం ఈ విధంగా వ్యాఖ్యానించింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ మద్రాసు హైకోర్టు ఆదేశించడాన్ని సవాలు చేస్తూ విజయ్ నేతృత్వంలోని టీవీకే సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. ఈ విషయంలో చెన్నై బెంచ్‌లో ఏదో తప్పిదం జరుగుతోందని, కోర్టు అనుసరిస్తున్న నియమాలను పరిశీలిస్తామని వ్యాఖ్యానించింది. రిజిస్ట్రార్ జనరల్ అందించిన నివేదికను కక్షిదారులతో పంచుకొని వారి స్పందన తీసుకోవాలని ఆదేశించింది.



తొక్కిసలాట ఘటనలో మద్రాస్ హైకోర్టు జోక్యం చేసుకున్న తీరుపైనా సుప్రీం కోర్టు గతంలో పలు ప్రశ్నలు లేవనెత్తింది. కరూర్ అనేది మదురై బెంచ్ పరిధిలో ఉంటే చెన్నై బెంచ్ ఎలా సిట్ ఏర్పాటుకు ఆదేశిస్తుందని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రోడ్‌షోలు నిర్వహించడానికి మార్గదర్శకాలను కోరుతూ పిటిషన్ దాఖలైతే.. సిట్‌తో దర్యాప్తు చేయాలని ఆదేశించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది.

## నిరాహార దీక్ష చేపట్టనున్న అన్నాహజారే

పుణె: మహారాష్ట్రలోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో జనవరి 30న నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే వెల్లడించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని ఆయన ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి ఈ చట్టం చాలా కీలకమని.. అయితే పదే పదే హామీలు ఇచ్చినప్పటికీ దానిని విస్మరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తాను నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు 88 ఏళ్ల హజారే తెలిపారు. ఇప్పుడు తాను చేపట్టేబోయే నిరాహార దీక్షయే చివరిది అవుతుందేమోనని తెలిపారు. లోకాయుక్త చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే 2022లో తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేశారు. లోకాయుక్తను అమలు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో ఆందోళనను ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత ఓ కమిటీ చట్టాన్ని రూపొందించింది. ఈ బిల్లును మహారాష్ట్ర శాసనసభలోని ఉభయ



సభలు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాయి. ఈ చట్టం ఇంకా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని అన్నాహజారే పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి ఫడణవీస్‌కు తాను ఏడు లేఖలు రాసినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో తాను నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఇన్నేళ్లవుతున్నా మహారాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్త చట్టాన్ని క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు చేయట్లేదో తెలియట్లేదని విమర్శించారు.

## ఉపాధిహామీ పథకం పేరు మారింది..
## పనిదినాలు పెంచుతూ కేంద్రం నిర్ణయం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మారింది. పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా పేరు మారుస్తూ శుక్రవారం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది. (ద్రవ్యోల్బణంలో వ్యత్యాసం కారణంగా రాష్ట్రాల వారీగా కనీస వేతనాల్లో మార్పులు ఉంటాయి). పల్లెప్రాంత నిరుపేదలకు ఏడాదిలో వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం 'ఎన్ఆర్ఈజీఏ' పథకాన్ని 2006లో ప్రారంభించింది. తర్వాత దానిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా పేరు మార్చారు. ఇప్పుడు మరోసారి ఆ పేరు మార్పునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.



*** బీమా రంగంలోకి 100 శాతం ఎఫ్‌డీఐ..**

బీమారంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సాధారణ, జీవిత, ఆరోగ్య బీమాలో 74% వరకు ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది. ఈ రంగంలోకి ఎఫ్‌డీఐలకు పూర్తిగా అనుమతినిస్తే, దేశీయ పెట్టుబడులూ పెరిగే అవకాశం ఉందని కేంద్రం అంచనావేస్తోంది. 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతిస్తే, విదేశీ సంస్థలు భారతీయ కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగా పనిచేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని, దీనివల్ల ఈ రంగానికి మేలు జరిగే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఆమోదం లభించింది.

**రెండు దశల్లో జనాభా లెక్కలు..**

2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్ని రెండు దశల్లో నిర్వహిస్తామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గృహాలను జాబితా చేసి, లెక్కిస్తామని చెప్పారు. 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కల సేకరణపై దృష్టిపెడతామని చెప్పారు. ఇదే తొలి డిజిటల్ జనగణన అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ జనాభా లెక్కల్లోనే కుల గణన చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ కోసం రూ.11,718 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

## చైనా వృత్తి నిపుణులకు గేట్లు బార్లా..
## వీసా నిబంధనల్లో భారత్ సడలింపులు..!

చైనా వృత్తి నిపుణులకు సాధ్యమైనంత వేగంగా బిజినెస్ వీసాలు ఇచ్చేలా భారత ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యేందుకు ఇది కీలక అడుగు కానుంది. సంబంధిత అధికారులను ఉటంకిస్తూ 'రాయిటర్స్' వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ సడలింపుల వల్ల వీసా జాప్యాలు ఉండవని, దాంతో వ్యాపారాలకు నిపుణుల కొరత లేకుండా చూసుకోవచ్చని వెల్లడించింది. వీసా ఆమోద సమయాన్ని నాలుగు వారాల్లోపునకు కుదించడంతో పాటు కొన్ని పరిశీలన స్థాయుల్ని తొలగించారని అధికారులు వెల్లడించారు.



రష్యా చమురు కొనుగోలు చేస్తున్నామనే నెపంతో అమెరికా భారత్‌పై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఆ నేపథ్యంలోనే ఆగస్టులో షాంఘై సహకార సంస్థ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలని ఆ సందర్భంగా ఇద్దరు నేతలు పిలుపునిచ్చారు. సరిహద్దు వివాదాలు పక్కనపెట్టి అన్ని రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో తాజా అడుగు పడింది. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత చైనీయులకు ఇచ్చే వీసాలపై కఠిన ఆంక్షలు విధించింది. బిజినెస్ వీసాల పరిశీలనను తీవ్రతరం చేసింది. వీసాలు పొందడంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కారం అయ్యాయని సదరు అధికారులు పేర్కొన్నారు.

## ఐదేళ్లలో 9 లక్షల మంది భారత పౌరసత్వాన్ని వదులుకొన్నారు: విదేశాంగశాఖ

గత ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంటులో పేర్కొన్నారు. భారత పౌరసత్వం విషయంలో పార్లమెంట్‌లో అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత పౌరసత్వాన్ని వదులుకొనే వ్యక్తుల వార్షిక రికార్డులను ప్రభుత్వం భద్రపరుస్తోందని తెలిపారు. ఆ రికార్డుల ప్రకారం.. 2011..2019 మధ్య 11,89,194 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని తెలిపారు. గత 14 సంవత్సరాల్లో భారత్‌లోని 20 లక్షలకు పైగా ప్రజలు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నట్లు డేటా సూచిస్తోంది. దీంతో విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు




వెల్లడిస్తున్నాయి. ఇటీవల కాలంలో విదేశీ పౌరసత్వాన్ని పొందుతున్న భారతీయుల సంఖ్య మరింత పెరిగిందని.. గడిచిన ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పేర్కొన్నారు.

**నకిలీ గల్ఫ్ ఉద్యోగాల ఆఫర్లు..**

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల కోసం భారత్ యువత నకిలీ గల్ఫ్ ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులై అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల బారిన పడుతున్నారని కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పేర్కొన్నారు. ఇటీవల ఇటువంటి కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటిలో చాలావరకు సోషల్ మీడియాలో ఉద్యోగ ఆఫర్లను నమ్మడంతోనే మొదలవుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటివి నివారించడానికి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా విదేశాంగ శాఖ యువతకు అవగాహన కల్పిస్తోందన్నారు. నమోదు కాని ఏజెంట్లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 2025 నాటికి 3,505 నమోదుకాని ఏజెంట్ల వివరాలను ఇమ్మిగ్రేట్ పోర్టల్‌లో పొందుపరిచామన్నారు.



## 42 కంపెనీలకు ఒక్కటే అడ్రస్..
## లూథ్రా బ్రదర్స్ వ్యాపారంలో చీకటి కోణం

గోవాలో అగ్ని ప్రమాదం జరిగిన నైట్ క్లబ్ 'బిర్చ్ బై రోమియో లేన్' యజమానులు, సోదరులైన సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో లూథ్రా బ్రదర్స్ వ్యాపారాలలోని పలు చీకటి కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇతరులతో కలిసి లూథ్రా సోదరులు నిర్వహిస్తున్న 42 కంపెనీలకు ఢిల్లీలో ఒక్కటే అడ్రస్ ఉన్నట్లు విచారణలో గుర్తించామని అధికారులు వెల్లడించారు. ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు, ఎల్ఎల్‌పీలు సహా 42 వేర్వేరు సంస్థలలో లూథ్రా సోదరులు డైరెక్టర్లు, భాగస్వాములుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. అన్ని సంస్థలకు ఢిల్లీలోని ఓ భవనం చిరునామాగా ఉండడంతో వీరు డమ్మీ కంపెనీలు నిర్వహిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

*** గోవాలోని అన్ని పబ్‌లు.. క్లబ్‌లలో తనిఖీలు**

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి పాటించాల్సిన కనీస భద్రతా సౌకర్యాలు కూడా లేకపోవడంతో నైట్ క్లబ్‌లో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. బేస్‌మెంట్‌లో తగినంత వెలుతురు లేకపోవడం, బయటకు వెళ్లడానికి సరైన మార్గం లేకపోవడంతో చాలామంది అందులోనే చిక్కుకుపోయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని క్లబ్‌లు, రెస్టరంట్‌లలో తనిఖీలు చేయడానికి గోవా ప్రభుత్వం పలు బృందాలను ఏర్పాటుచేసింది. అక్రమాలు జరుగుతున్నట్లు అనుమానం ఉన్న క్లబ్‌లను ఈ బృందాలు ఇప్పటికే మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు.

## కుమార్తెల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

పట్నా: తాను ఆర్జేడీ పార్టీ నుంచి, కుటుంబం నుంచి బయటకు వచ్చేసినట్లు బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా నీతీశ్ ప్రభుత్వానికి ఆమె చేసిన అభ్యర్థన పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ప్రతి స్త్రీ తల్లిదండ్రుల ఇళ్లల్లో సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రోహిణి ఆచార్య నీతీశ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సోషల్ మీడియా పోస్టులో బిహార్ మహిళల అభివృద్ధికి నీతీశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రోహిణి ప్రశంసించారు. అయితే స్త్రీల అభివృద్ధికి రూ.10వేలు పంపిణీ, పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు ఇవ్వడం మాత్రమే సరిపోవని కుమారులతో సమానంగా కుమార్తెలకు హక్కులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కుమార్తెల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. బిహార్ ప్రజల్లో పాతుకుపోయిన పితృస్వామ్య మనస్తత్వ, రాజకీయ రంగాలలో మార్పు తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. తల్లిదండ్రుల ఇళ్లల్లో కుమార్తెలు ఎటువంటి భయం లేకుండా సురక్షితంగా ఉండే హక్కు వారికి ఉందన్నారు. ఇందుకోసం చర్యలు తీసుకోవాలని నీతీశ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. భవిష్యత్తులో దోపిడీ, హింస నుంచి మహిళలను



రక్షించడానికి ఇది ఓ ముందడుగుగా భావించాలని పేర్కొన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో ఇప్పటికే పలు సమస్యలు తలెత్తడంతో పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ వేరుగా ఉంటున్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో లాలూ కుమార్తెలు కూడా ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో తాజాగా ఆయన కుమార్తె రోహిణి చేసిన పోస్టుతో వారి కుటుంబంలో కలహాలు మరింత ముదిరినట్లు తెలుస్తోంది.

## ఇండిగో సంక్షోభం.. నలుగురు అధికారులపై డీజీసీఏ వేటు..!

ఇండిగో సంక్షోభంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో నలుగురు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లపై వేటు వేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సిబ్బంది తొలగింపునకు సంబంధించి స్పష్టమైన కారణాన్ని డీజీసీఏ ప్రకటించలేదు. అయితే, విమానయాన సంస్థ భద్రత, కార్యాచరణ పర్యవేక్షణలో లోపం వల్లే ఈ సంక్షోభం తలెత్తినట్లు డీజీసీఏ భావిస్తోంది. దీంతో ఈ విభాగంలోని నలుగురు అధికారులను డీజీసీఏ సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ఇండిగో గందరగోళం నేపథ్యంలో ఆ విమానయాన సంస్థపై డీజీసీఏ తన పర్యవేక్షణను మరింత విస్తృతం చేసింది. అందులోభాగంగా గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయంలో రెండు బృందాలను ఏర్పాటుచేసింది. ఇందులోని మొదటి బృందం రోజువారీ విమాన కార్యకలాపాలు, సిబ్బంది వినియోగంతో సహా పలు కీలక విషయాలను పరిశీలిస్తోంది. రెండో బృందం ప్రయాణికులకు రిఫండ్‌లు, వారి సామాన్లు తిరిగివ్వడం వంటి సంక్షోభం వల్ల ఏర్పడిన సమస్యలను పరిశీలిస్తోంది. వీటికి సంబంధించిన రిపోర్ట్‌లను ఎప్పటికప్పుడు అధికారులకు అందిస్తారు.




# మరిన్ని చిక్కుల్లో ఇండిగో.. రంగంలోకి సీసీఐ!




ఢిల్లీ: దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చుట్టూ ఉచ్చు బిగుస్తోందా? అంటే అవుననే అంటున్నాయి అధికార వర్గాలు. అంతర్గత లోపాల కారణంగా వందల విమానాలు రద్దు చేసిన ఆ సంస్థపై ఇప్పటికే డీజీసీఏ దర్యాప్తు జరుపుతోంది. సంస్థ కార్యకలాపాలను ఓ కంట కనిపెడుతోంది. ఇప్పుడు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా కూడా రంగంలోకి దిగింది. అతిపెద్ద మార్కెట్ వాటా కలిగిన ఇండిగో.. పోటీ నిబంధనలనూ ఉల్లంఘించిందా? అనే అంశంపై ప్రాథమికంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశీయ పౌర విమానయాన రంగంలో దాదాపు 65శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉన్న ఇండిగో సంస్థ డిసెంబర్ 2నుంచి వందల విమానాలను రద్దు చేసింది. దీంతో కొన్ని వేల మంది తమ ప్రయాణాలు రద్దై ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ దర్యాప్తు చేస్తోంది. పెద్దఎత్తున విమానాల రద్దుకు అతిపెద్ద మార్కెట్ వాటా కలిగి ఉండడం కూడా కారణమా? అనే కోణంలో సీసీఐ అంతర్గతంగా పరిశీలిస్తోంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదూ రాలేదని, సుమోటోగా అంశాన్ని సీసీఐ పరిశీలిస్తోందని సీనియర్ అధికారి 'పీటీఐ'కి వెల్లడించారు. విమానయాన రంగంలో ఆధిపత్య స్థానం, నిర్దిష్ట మార్గాల్లో ఆధిపత్యం, ఆధిపత్య దుర్వినియోగం వంటి అంశాలను సీసీఐ పరిశీలిస్తోందని సంబంధిత అధికారి తెలిపారు. కాంపిటీషన్ యాక్ట్ ప్రకారం.. అత్యధిక మార్కెట్ వాటా కలిగి ఉండడం పోటీని ఉల్లంఘించినట్లు కాదు. ఒకవేళ ఆ ఆధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేస్తే పోటీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని సంబంధిత అధికారి తెలిపారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ప్రాథమిక దర్యాప్తు చేసి, అందులో పోటీ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సమగ్ర దర్యాప్తునకు ఆదేశించే అవకాశం ఉంటుంది. సమగ్ర దర్యాప్తులో సంస్థది తప్పని తేలితే జరిమానా విధించడం లేదా ముమ్మందు అనైతిక వ్యాపార పద్ధతులకు పాల్పడకుండా నిరోధించే అధికారం సీసీఐకి ఉంది.

# వాట్సప్‌లో కొత్త ఫీచర్లు
## మిస్డ్‌కాల్ మెసేజెస్.. ఇమేజ్‌తో షార్ట్ వీడియో!




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ కొత్త ఫీచర్లను ప్రకటించింది. యూజర్లను ఆకట్టుకోవడంలో భాగంగా ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను జోడిస్తున్న ఈ సంస్థ.. ఈసారి ఒకేసారి పలు కొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. మిస్డ్‌కాల్స్‌కు వాయిస్ మెసేజెస్, ఫన్ స్టిక్కర్స్, మెటా ఏఐతో ఇమేజ్‌లను షార్ట్ వీడియోలుగా రూపొందించడం వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మేరకు వాట్సప్ తన బ్లాగ్ పోస్ట్‌లో వివరాలను వెల్లడించింది.

**మిస్డ్ కాల్ మెసేజెస్**

వాట్సప్‌లో మీరు ఎవరికైనా కాల్ చేసినప్పుడు కొన్నిసార్లు వారు ఆన్సర్ చేయలేకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో మీ అవసరాన్ని వాయిస్ లేదా వీడియో నోట్ ద్వారా వారికి పంపించొచ్చు. చాట్ స్క్రీన్‌లో మిస్డ్ కాల్ దిగువనే ఈ కొత్త బటన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేసి అవతలి వ్యక్తి ఆ వీడియో/ఆడియో చూడొచ్చు. ఇక వాయిస్ చాట్ సమయంలో గ్రూప్ సంభాషణలకు అంతరాయం కలిగించకుండా 'చీర్స్' వంటి కొత్త రియాక్షన్‌లతో స్పందించే సదుపాయాన్నీ వాట్సప్ తీసుకొచ్చింది. అలాగే, జూమ్, గూగుల్ మీట్ తరహాలో వీడియో కాల్స్ సమయంలో మాట్లాడే వ్యక్తికి ఆటోమేటిక్‌గా ఇకపై ప్రాధాన్యం లభిస్తుంది.

**మెటా ఏఐ ఇమేజ్ క్రియేషన్**

వాట్సప్‌లో మెటా AI ఇమేజ్ క్రియేషన్‌ను అప్‌గ్రేడ్ చేసింది. మిడ్ జర్నీ, ఫ్లక్స్ వంటి ఇమేజ్ జనరేషన్ మోడల్ సామర్థ్యాలను దీనికి జోడించింది. దీని ద్వారా ఇకపై గ్రీటింగ్స్‌ను రూపొందించేటప్పుడు ఆ మార్పును స్పష్టంగా గమనించొచ్చని వాట్సప్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. అలాగే, మెటా AI సాయంతో యూజర్లు ఒక ఫొటోను షార్ట్ వీడియోగానూ రూపొందించొచ్చు. డెస్క్‌టాప్‌లో వాట్సప్ వినియోగదారులకు ఇకపై కొత్తగా మీడియా ట్యాబ్ దర్శనమిస్తుంది. మీరు ఎవరికైనా పంపిన లేదా మీకు ఎవరి నుంచి వచ్చిన డాక్యుమెంట్లు, లింకులు, ఫొటోలు, వీడియోలు ఈ బటన్‌లో ఒకేచోట కనిపిస్తాయి. చాట్‌కు అంతరాయం లేకుండా కొనసాగించేందుకు వీలుగా లింక్ ప్రివ్యూల రూపాన్ని సమూలంగా మార్చినట్లు వాట్సప్ తెలిపింది. ఇకపై లింక్ పూర్తిగా కనిపించకుండా.. కేవలం లింక్ టైటిల్, ప్రివ్యూ ఇమేజ్ మాత్రమే కనిపిస్తాయి.

**స్టేటస్‌లో కొత్త స్టిక్కర్లు**

స్టేటస్‌లో కొత్తగా స్టిక్కర్ల ఆప్షన్‌ను జోడించినట్లు వాట్సప్ పేర్కొంది. మ్యూజిక్ లిరిక్స్, ఇంటరాక్టివ్ స్టిక్కర్లు, క్వశ్చన్లను ఇకపై స్టేటస్‌కు జోడించొచ్చని తెలిపింది. దానికి అవతలి వ్యక్తులు కూడా స్పందించొచ్చని తెలిపింది. అలాగే, వాట్సప్ ఛానెల్‌లో కొత్తగా ప్రశ్న అనే సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు వాట్సప్ తన బ్లాగ్ పోస్ట్‌లో తెలిపింది. అడ్మిన్లు తమ యూజర్లతో ఎంగేజ్ అవ్వడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుందని, యూజర్లు ఇచ్చిన రిప్లయ్‌లను అడ్మిన్‌లు మాత్రమే చూడగలరని తెలిపింది. వారికి రిప్లైలు కూడా ఇవ్వగలరని తెలిపింది.

# సరైన బ్యాంకును ఎంచుకోండి



తొలిసారి ఉద్యోగంలో చేరినప్పుడు లేదా ఇంటికి దగ్గరగా ఉందని ఏదో ఒక బ్యాంకులో పొదుపు ఖాతా తీసుకుంటాం. డిజిటల్ బ్యాంకింగ్, మారుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో మనం ఏ బ్యాంకును ఎంచుకుంటున్నాం అనే విషయంపై కాస్త శ్రద్ధ పెట్టడం ఇప్పుడు చాలా అవసరం. ముఖ్యంగా మీ బ్యాంకు ఖాతాలో ఎక్కువ మొత్తంలో నగదు నిల్వ ఉంచే అలవాటు ఉంటే, ఇది మరింత కీలకం అవుతుంది. మీ డబ్బుకు భద్రత ఉండాలి, అదే సమయంలో కొంత రాబడిని అందించేలా ఈ ఖాతా ఉండాలి. పొదుపు ఖాతా ముఖ్య ఉద్దేశం ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదును తీసుకునేందుకు వీలుండటం. కరెంటు బిల్లు కట్టడం, కిరణా సరకులు కొనడం, రోజువారీ ఖర్చులు చేయడంలాంటివి. కాబట్టి, మూడు నెలలకు సరిపోయే ఖర్చుల డబ్బును మాత్రమే అందులో ఉంచాలి. అంతకుమించి ఎక్కువ డబ్బును సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల పెద్దగా లాభం ఉండదు. ఈ ఖాతాపై బ్యాంకులు ఇచ్చే వడ్డీ కేవలం 2.5శాతమే. కొన్ని బ్యాంకులు ఇంకా తక్కువగానూ ఇస్తున్నాయి. వడ్డీ రేట్లతోపాటు బ్యాంకు విధించే ఛార్జీల గురించీ తెలుసుకోవాలి. కనీస బ్యాలెన్స్ లేకపోతే వేసే జరిమానాలు, ఏటీఎం ఛార్జీలు దీర్ఘకాలంలో భారమవుతాయి. మీ బ్యాంకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్‌ను సులభంగా నిర్వహించేలా ఉండాలి. వినియోగదారుల సేవలు బాగుండాలి. చిన్న పనులకూ ఇబ్బంది పెట్టే బ్యాంకును ప్రధాన ఖాతా తీసుకునేందుకు ఎంచుకోవద్దు. ఎక్కువ డబ్బును ఖాళీగా ఈ ఖాతాలో ఉంచొద్దు. ఉదాహరణకు మీ దగ్గర రూ.10లక్షల నుంచి రూ.50లక్షల వరకూ ఉంటే, దానిని పొదుపు ఖాతాలో ఉంచినప్పుడు మీరు చాలా నష్టపోతారు. ఆ డబ్బును వేరేచోట పెట్టుబడి పెడితే వచ్చే అధిక లాభాన్ని మీరు కోల్పోతున్నారని అర్థం. ఇలాంటప్పుడు అవసరానికి మించి ఉన్న డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలోకి మళ్లించడం మేలు. మీ డబ్బుకు అధిక రాబడి, భద్రత కావాలనుకున్నప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉత్తమం. రాబోయే కొద్ది రోజుల్లో స్కూలు ఫీజులు చెల్లించడానికి, ఇల్లు నిర్మాణానికో దాచిన డబ్బును మంచి బ్యాంకులో ఎఫ్‌డీ చేయడం మంచిది.

# 21 ఏళ్ల భారత రికార్డ్ బ్రేక్..
## టీమ్‌ఇండియా భారీ స్కోర్.. యూఏఈ లక్ష్యం 434



అండర్19 ఆసియా కప్ 2025లో భాగంగా దుబాయ్ వేదికగా టీమ్‌ఇండియా, యూఏఈ తలపడ్డాయి. టాస్ గెలిచిన యూఏఈ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 433 భారీ స్కోర్ సాధించింది. అండర్ 19 విభాగంలో టీమ్‌ఇండియాకు ఇదే అత్యధిక స్కోర్. ఇంతకు ముందు 2004లో భారతజట్టు 425 పరుగులు చేసింది. దీంతో 21 ఏళ్ల రికార్డ్ బ్రేక్ అయింది. ప్రస్తుత మ్యాచ్‌లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అతడు 55 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా వైభవ్.. 95 బంతుల్లో 171 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్స్‌లు, 9 ఫోర్లు బాదడం విశేషం. అరోన్ జార్జితో (69; 73 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) కలసి అతడు రెండో వికెట్‌కు 146 బంతుల్లో రికార్డు స్థాయిలో 212 పరుగులు జత చేశాడు. అరోన్ పెవిలియన్‌కు చేరిన తర్వాత విహాన్ మల్హోత్ర (69; 55 బంతుల్లో; 7 ఫోర్లు 1 సిక్స్) క్రీజులోకి వచ్చాడు. అతడితో కలిసి వైభవ్ మూడో వికెట్‌కు 34 బంతుల్లో 45 పరుగులు జత చేసి ఔటయ్యాడు. వేదాంత్ త్రివేది (38; 34 బంతుల్లో, 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. మరో ఓపెనర్, కెప్టెన్ ఆయుష్ మాత్రే (4;11 బంతుల్లో, 1 ఫోర్) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. చివర్లో అభిజ్ఞాన్ కుందు (32; 17 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్స్), కాన్సిక్ చౌహాన్ (28; 12 బంతుల్లో, 1 ఫోర్, 3 సిక్స్‌లు) వేగంగా పరుగులు చేశారు. ఖిలాన్ పటేల్ 5 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. యూఏఈ బౌలర్లలో ఉద్దిశ్ సురి, యుగ్ శర్మ 2, షలోమ్ డిసౌజ, యాయిన్ రాయ్ తలో వికెట్ తీసుకున్నారు.




# గిల్ ఫామ్ కోల్పోవడం టీమ్‌ఇండియాకు మంచి సంకేతం కాదు: ఇర్ఫాన్ పఠాన్



శుభ్‌మన్ గిల్ ఫామ్ కోల్పోవడం భారత జట్టుకు శుభపరిణామం కాదని, టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. అయితే సంజు శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకొచ్చినా వెంటనే ఆశించిన ఫలితాలు రాకపోవచ్చని అతడు అభిప్రాయపడ్డాడు. శాంసన్ కుదురుకోవడానికి కాస్త సమయం పట్టొచ్చని విశ్లేషించాడు. 'శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బంతికి ఔటయ్యాడు. నిజానికి అతడు ఫామ్‌లో ఉండి ఉంటే ఆ బాల్‌ను చాలా తేలిగ్గా ఆడేవాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విషయానికొస్తే.. తన ఆఫ్‌సైడ్ ఆట మీద దృష్టి కేంద్రీకరించాలి. ఔటైనప్పుడు అసలు పొజిషన్‌లో లేడు' అని ఇర్ఫాన్ అన్నాడు. 'శుభ్‌మన్ గిల్ బ్యాట్ నుంచి పరుగులు రాకపోవడం టీమ్‌ఇండియాకు మంచి సంకేతం కాదు. అది అతడితోపాటు టీమ్ మేనేజ్‌మెంట్ మీద కూడా ఒత్తిడిని పెంచుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే.. ఒకవేళ జట్టులోకి సంజుశాంసన్‌ను తీసుకొచ్చినా వెంటనే ఆశించిన ఫలితం కనిపించకపోవచ్చు' అని పేర్కొన్నాడు. అలాగే సూర్యకుమార్ యాదవ్ విపరీతమైన ఒత్తిడిలో ఉన్నాడని ఇర్ఫాన్ తెలిపాడు. 'కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆటగాడిగా వరుసగా విఫలమవుతున్నాడు. దీంతో అతడు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్‌లోగా ఫామ్ అందిపుచ్చుకోవాలి. అతడు సరైన బ్యాటింగ్ ఆర్డర్‌లో రావాలి. అలాగే అతడి షాట్ సెలక్షన్ సరిగ్గా ఉండాలి. సూర్య.. నేరుగా వస్తున్న బంతుల్ని కూడా లెగ్‌సైడ్ ఆడే ప్రయత్నంలో ఔట్ అవుతున్నాడు. ఆ విషయం మీద అతడు దృష్టిసారించాలి. ఎప్పుడైతే బ్యాటర్ ఫామ్‌లో ఉండరో.. అప్పుడు అతడు ఆఫ్‌సైడ్, నేరుగా బంతిని ఆడే ప్రయత్నం చేయాలి' అని సూర్యకుమార్ యాదవ్‌కు ఇర్ఫాన్ పఠాన్ కీలక సూచనలు చేశాడు.

# వినేశ్ ఫొగాట్ యూటర్న్.. రిటైర్మెంట్ నుంచి వెనక్కి



స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ యూటర్న్ తీసుకున్నారు. రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఒలింపిక్ కలను నెరవేర్చుకునేందుకు మళ్లీ రెజ్లింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు. 2028లో లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె పోస్టు పెట్టారు. 2024లో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ రజతం ఖాయం చేసింది. కానీ రెండోరోజు బరువు చూసే సమయానికి 100 గ్రాములు అదనంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. ఈ బాధతోనే రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, జులానా నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. మరోవైపు, ఈ జులైలో ఆమె ఒక బాబుకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని కూడా ఆమె పోస్టులో పేర్కొన్నారు. "ఈసారి నేను ఒంటరిగా ప్రయాణించడం లేదు. నా టీమ్‌లో ఇప్పుడు నా కుమారుడు ఉన్నాడు. వాడే నాకు అసలైన ప్రేరణ. నా లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ ప్రయాణంలో వాడు నా చిట్టి చీర్‌లీడర్" అని రాసుకొచ్చారు. వినేశ్ ఇప్పటికి పలుమార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడ్డారు. 2016లో జరిగిన ఒలింపిక్స్‌తో ఆమె ఎంట్రీ ఇచ్చారు. అయితే అప్పట్లో మోకాలి గాయంతో క్వార్టర్స్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2021లో భారీ అంచనాలతో టోక్యో ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టినప్పటికీ.. అక్కడా క్వార్టర్స్‌లోనే అనూహ్యంగా ఓటమి చవిచూశారు. 2024లో త్రుటిలో పతకం చేజార్చుకున్న సంగతి తెలిసిందే.

# గిల్, సూర్య.. తిరిగి పుంజుకుంటారన్న నమ్మకం మాకుంది

* **టీమ్‌ఇండియా సహాయ కోచ్**



టీమ్‌ఇండియా సహాయ కోచ్ ర్యాన్‌టెన్ డస్కాటే.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు మద్దతుగా నిలుస్తున్నాడు. వారి ఫామ్ మీద ఆందోళన అవసరం లేదంటున్నాడు. వారు త్వరలోనే తిరిగి పుంజుకుంటారని ఆశాభావం వ్యక్తంచేశాడు. సూర్యకుమార్, గిల్.. టీ20ల్లో వారి పేలవ ప్రదర్శనను గురువారం ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లోనూ కొనసాగించారు. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ 5, శుభ్‌మన్ గిల్ పరుగులు మాత్రమే చేసి, మిగతా బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా గిల్ తాను ఎదుర్కొన్న మొదటి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా.. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 214 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక 162 రన్స్‌కు కుప్పకూలింది. దీంతో ఈ మ్యాచ్‌లో 51 పరుగుల తేడాతో భారత జట్టు ఓడిపోయింది. ప్రస్తుతం 1-1తో భారత్, దక్షిణాఫ్రికా జట్లు సిరీస్‌లో సమఉజ్జీలుగా నిలిచాయి.

## ఎంటర్‌టైన్‌మెంట్ ముసుగులో హింసను చూపిస్తున్నారు..

### హాట్ టాపిక్‌గా మారిన రాధికా ఆప్టే కామెంట్స్

టాకీస్: ఇండియన్ సినిమాల్లో హింస అధికమైపోతుందన్న అంశంపై నటి రాధికా ఆప్టే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే పలు బోల్డ్ పాత్రలు, కంటెంట్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాధికా.. గత ఏడాది నుంచి మాత్రం సినిమాలకు కొంత దూరంగా ఉంటోంది. తాను చూసే కంటెంట్, స్క్రిప్టుల ఎంపికపైనా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలోనే .. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాధికా చేసన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. "నిత్యం తెరపై హింసను చూపిస్తూ, అదే వినోదమని చెప్పడం చాలా ప్రమాదకరం. ఎంటర్‌టైన్‌మెంట్ ముసుగులో ఊహించలేని స్థాయి హింసను చూపిస్తున్నారు. అది నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. చిన్న పిల్లలూ కూడా ఈ కంటెంట్‌కు చాలా సులభంగా ఎక్స్‌పోజ్ అవుతున్నారు. దీనిపై అందరం ఒక్కసారైనా ఆలోచించాలి" అని పేర్కొంది. తాను ఫ్యామిలీ ప్రారంభించాలని ఆలోచించే ఈ దశలో.. ఇలాంటి వాతావరణం మరింత భయపెడుతోందని కూడా ఆమె చెప్పింది. ఇలాంటి ప్రపంచంలో తన బిడ్డను పెంచాలనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే దర్శకుల తీరు కూడా మారాల్సిన అవసరం ఉందని, కథ చెప్పడమే లక్ష్యం అయితే హింసను రెప్పపాటులో చూపడం అవసరం లేదని రాధికా స్పష్టం చేసింది. "ఒక హంతకుడి కథ చెప్పాలంటే.. వాడు చేసే హత్యలను క్లియర్ షాట్స్‌లో చూపించాల్సిన అవసరం లేదు. అతని మనస్తత్వం, నేపథ్యం, కథ విశ్లేషణ - ఇవన్నీ కూడా హింస లేకుండా చెప్పవచ్చు.
కానీ ఇవాళ చాలామంది దర్శకులు హింసను స్టైల్‌గా చూపించే దిశగా వెళుతున్నారు. అది నన్ను అసహనానికి గురి చేస్తోంది" అని ఆమె అభిప్రాయపడింది. అలాగే, హింసను చూపడం వల్ల ప్రేక్షకుల భావోద్వేగాలపై పడే ప్రభావం గురించి కూడా ఆమె వివరించింది. "హింసను ఎక్కువగా చూసే కొద్దీ.. మన సంభాషణలు, మన తీరు, మన ప్రవర్తన కూడా ప్రభావితం అవుతుంది. ఇది ఒక సైకాలజికల్ విషయం. ఈ సినిమాల వల్లే ఎవరికైనా హింసాత్మక అవతారం రావాలి అని కాదు. కానీ మన మైండ్‌కు ఇవ్వబడే ఇన్‌పుట్ చాలా ముఖ్యం. మనం ఏం చూస్తామో.. మన ఆలోచనలలో, మనం చేసే పనిల్లో ఆ ప్రభావం చూపుతుంది" అని అన్నారు.




MOVIE TIME

## రెండో సీజన్ రెడీ




టాకీస్: తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఆహా' లో సూపర్ హిట్ అయిన '3 రోజెస్' వెబ్ సిరీస్ ఇప్పుడు రెండవ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సీజన్ 2 ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మొదటి సీజన్‌లో ఇషా రెబ్బా, పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ సీజన్ 2లో ఇషా రెబ్బాతో పాటు రాశీ సింగ్ మరియు కుషిత కల్లపు కొత్త 'రోజెస్'గా కనిపించ నున్నారు. కమెడియన్ వైవా హర్షతో పాటు స... కూడా నవ్వులు పూయించడానికి రెడీగా ఉన్నారు. ఎస్.కె.ఎన్ నిర్మాణంలో, కిరణ్ కారవల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ డిసెంబర్ 13 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ ట్రైలర్‌ను మీరు కూడా చూసేయండి. ఈ వెబ్ సిరీస్‌కు కిరణ్ కె కరవ... దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్... నిర్మిస్తున్నాడు.

టాకీస్: డీసీ స్టూడియోస్, వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ నుంచి వస్తున్న మరో సూపర్ హీరో చిత్రం 'సూపర్ గర్ల్'. 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' ఫేమ్ నటి మిల్లీ ఆల్కాక్ ఈ చిత్రంలో సూపర్ గర్ల్‌గా నటించబోతుంది. ఈ సినిమాకు క్రెయిగ్ గిల్లెస్పీ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రపంచవ్యాప్తంగా జూన్ 26, 2026 న ఇంగ్లీష్‌తో పాటు తెలుగు మరియు ఇతర ప్రాంతీయ భాషల్లో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సినిమా 'సూపర్‌మ్యాన్: ఉమెన్ ఆఫ్ టుమారో' అనే కామిక్ ఆధారంగా రాబోతుండగా.. 'కారా జోర్-ఎల్' అలియాస్ సూపర్ గర్ల్ పాత్రలో నటిస్తుంది మిల్లీ ఆల్కాక్. ఇందులో కారా జోర్-ఎల్ 20 ఏళ్ల యువతిగా, సూపర్ గర్ల్ పవర్స్ ఉన్నప్పటికీ వాటిని సరిగా ఉపయోగించలేని విధంగా కనిపిస్తుంది. అయితే దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు తాను ఏ విధంగా ఆ సమస్యను ఎదుర్కోంది అనేది ఈ సినిమా కథ.

## 'సూపర్ గర్ల్' టీజర్ విడుదల



## అఖండ-2కు హైకోర్టులో ఊరట



**టాకీస్:** 'అఖండ 2' నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ కు తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఊరట దక్కింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై ఈ నెల 14 వరకూ డివిజన్ బెంచ్ స్టే ఇస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ2: తాండవం'. తెలంగాణలో ఈ మూవీ టికెట్ ధరల పెంపు, ముందస్తు ప్రీమియర్‌లపై గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీన్ని విచారించిన కోర్టు ప్రీమియర్ రద్దుతో పాటు, టికెట్ ధరలను పెంచకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ డివిజన్‌కు అప్పీల్ చేసుకుంది.

## ధురంధర్ సినిమా అద్భుతంగా ఉంది

### సినిమా చూసి ప్రశంసలు కురిపించిన అల్లు అర్జున్

**టాకీస్:** బాలీవుడ్‌లో కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న 'ధురంధర్' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించాడు అగ్ర కథానాయకుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ . తాజాగా ఈ సినిమాను వీక్షించిన బన్నీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ఇప్పుడే 'ధురంధర్' సినిమా చూశాను. అత్యుత్తమ నటన, అద్భుతమైన సాంకేతిక అంశాలు, అద్భుతమైన సౌండ్‌ట్రాక్‌లతో కూడిన అద్భుతమైన చిత్రం ఇది. నా సోదరుడు రణ్‌వీర్ సింగ్ తన నటనతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. సినిమా మొత్తానికే హైలైట్‌గా నిలిచాడు. అలాగే అక్షయ్ ఖన్నా పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ తమ తమ పాత్రల్లో జీవించారు అని చెప్పవచ్చు. అలాగే హీరోయిన్ సారా అర్జున్ నటన కూడా ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాను నిర్మించిన సాంకేతిక నిపుణులు, నటీనటులు, సిబ్బంది, జ్యోతి దేశ్‌పాండే, జియో స్టూడియోస్‌కు నా అభినందనలు. అలాగే అన్నిటికంటే ముఖ్యంగా? ఈ చిత్రానికి కెప్టెన్, అద్భుతమైన ఫిల్మ్ మేకర్ ఆదిత్య ధర్.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.